సాక్షి
కామారెడ్డి
శనివారం | 25 | మే | 2024





**తండాకు విద్యుత్ షాక్**
రాజంపేట మండలంలోని పలుగుట్ట తండాలో నాలుగు రోజులుగా విద్యుత్ సమస్య తలెత్తింది.
- 8లో ▸



**కనుల పండువగా రథోత్సవం**
మద్నూర్ మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన రథోత్సవం కనుల పండువగా సాగింది.
- 9లో ▸

**వాతావరణం**
గరిష్ఠం/కనిష్ఠం 24.2 /43.2
ఉదయం గాలులు వీస్తాయి. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉక్కపోతగా ఉం టుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### ప్రారంభమైన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



**కామారెడ్డి టౌన్:** జిల్లాలో శుక్రవారం ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం జరిగిన ఇంటర్ ఫస్టియర్ ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్షకు 1,475 విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 1,363 మంది విద్యార్థులు హాజరై 112 విద్యార్థులు గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం జరిగిన సెకండియర్ పరీక్షకు 599 మంది విద్యార్థులకు గాను, 561 మంది హాజరై 38 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలను జిల్లా ఇంటర్మీయట్ నోడల్ అధికారి షేక్ సలాం పర్యవేక్షించారు.

### 27న నిధి ఆప్కే నికట్

**సుభాష్‌నగర్:** నిధి ఆప్కే నికట్ 2.0 కార్యక్రమం ఈనెల 27న నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ గణేష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిచ్‌పల్లిలోని రమన్ బాయి సి పటేల్ బీడీ కంపెనీలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రవణ్‌కుమార్, కామారెడ్డి జిల్లాలోని మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సుందర్‌శివరావు ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. పీఎఫ్ చందాదారులు, యజమానులు, పెన్షనర్లు అందరూ తగిన ఆధారాలతో హాజరు కావాలని సూచించారు. ఫిర్యాదులు అక్కడికక్కడే పరిష్కరిస్తామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్‌గా శ్రీహరి రాజు



**బాన్సువాడ:** బాన్సువాడ మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా శ్రీహరి రాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీహరి రాజుకు ఉన్నతాధికారులు ఇన్‌చార్జి కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. బాన్సువాడ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన అలీం సస్పెండ్ కావడంతో ఆయన స్థానంలో శ్రీహరి రాజును నియమించారు.

### బుక్కులు, యూనిఫాంలు విక్రయించవద్దు

**కామారెడ్డి టౌన్:** జిల్లాలోని ప్రయివేటు స్కూళ్లలో బుక్కులు, యూనిఫాంలు, విద్యార్థులకు సంబంధించిన ఇతర సామాగ్రిని విక్రయించవద్దని యాజమాన్యాలకు డీఈవో ఎస్.రాజు ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ నిబంధనలను విరుద్ధంగా అధిక ఫీజులను వసూలు చేయవద్దని, స్కూల్ పేర్లను మార్చవద్దని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### రైళ్లలో చోరీలను అరికట్టేందుకు కృషి



**ఖలీల్‌వాడి:** రైళ్లలో చోరీలు, నేరాల నిరోధానికి చర్యలు తీసుకోవాలని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) సికింద్రాబాద్ డివిజన్ ఐజీ ఆరోమా సింగ్ ఠాకూర్ సూచించారు. సురక్షా సమ్మేళన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లోని ఆర్‌పీఎఫ్ పోస్టును ఆమె తనిఖీ చేశారు. ఆయుధాలు, మందుగుండు సామగ్రితో పని చేసే సమయంలో అధికారులు, సిబ్బంది జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. రైళ్లపై రాళ్ల దాడి జరగకుండా చూడాలన్నారు. పని ప్రదేశంలో మహిళలపై లింగ వివక్ష, వేధింపులు చూపకూడదన్నారు. పోషకాహార ఆహారాన్ని తీసుకోవడం, వ్యాయామాలు, ధ్యానం, యోగా చేయడం ద్వారా ఒత్తిడిని తగ్గించుకుని ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని ఆమె అధికారులు, సిబ్బందికి సూచించారు. అనంతరం సిబ్బంది సమస్యలను తెలుసుకున్నారు. రైల్వే స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సన్నాలకు బోనస్!

- ఈ ఏడాది వానాకాలం నుంచే అమల్లోకి..
- క్వింటాలు వడ్లకు రూ. 5 వందలు
- జిల్లాలో మొదటి నుంచి దొడ్డురకాల సాగుకే మొగ్గు
- బోనస్‌తో రైతుల్లో మార్పు వచ్చేనా..?



**సాక్షి, కామారెడ్డి:** సన్న రకం వరి సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలుకు రూ. 5 వందల బోనస్ ఇస్తామని ప్రకటించింది. అది కూడా రాబోయే వానాకాలం సీజన్ నుంచే అమలు చేస్తామని వెల్లడించింది. దీంతో సన్నాల సాగుపై అంతటా చర్చ జరుగుతోంది. కాగా జిల్లాలో మొదటి నుంచి దొడ్డు రకాల సాగుకే రైతులు ప్రాధాన్యత ఇస్తుంటారు.

సన్నాల కన్నా ముందుగా చేతికందుతుందని, రోగాలు కూడా తక్కువగా ఉంటాయి, పైగా దిగుబడి కూడా ఎక్కువ వస్తుందన్న ఉద్దేశంతో చాలా మంది రైతులు దొడ్డురకం వరి సాగు చేస్తారు. నిజాంసాగర్ ప్రాజెక్టు కింద ఎక్కువగా రైతులు సన్నాలు సాగు చేస్తారు. మిగతా ప్రాంతాల్లో అంతంత మాత్రంగా సన్నరకం వరి పండిస్తారు. అయితే ప్రభుత్వం సన్న రకాల సాగును ప్రోత్సహించేందుకు బోనస్ ప్రకటించిన దరిమిలా సన్నరకాల సాగుపై రైతుల్లో ఆలోచనలు మొదలయ్యాయి. అయితే ప్రభుత్వం సన్నరకం వరి పంట సాగుకు బోనస్ ప్రకటించినా, ఇంకా విధివిధానాలు వెల్లడించలేదు. వర్షాకాలం సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఎలాంటి విధానాలు ప్రకటిస్తుందోనని ఎదురుచూస్తున్నారు.

| సంవత్సరం | వరి విస్తీర్ణం (ఎకరాలు) | దొడ్డు రకం (ఎకరాలు) | సన్నరకం (ఎకరాలు) |
|---|---|---|---|
| 2020 | 2,47,851 | 1,51,190 | 96,662 |
| 2021 | 2,77,855 | 2,18,023 | 59,832 |
| 2022 | 3,00,903 | 2,42,652 | 58,252 |
| 2023 | 3,16,951 | 1,87,001 | 1,29,949 |

### దొడ్డు రకాల సాగు విస్తీర్ణమే ఎక్కువ..

దశాబ్దాల కాలంగా జిల్లాలో దొడ్డు రకం వరి పంట సాగు చేయడం అలవాటుగా మారింది. దొడ్డు రకాలకు పెద్దగా తెగుళ్లు రాకపోవడం, సన్న వాటికన్నా ముందుగా కోతకు రావడం పైగా దిగుబడి కూడా ఎక్కువ వస్తుండడంతో రైతులు దొడ్డు రకాలకే మొగ్గుచూపుతూ వచ్చారు. అయితే గత రెండుమూడేళ్లుగా దొడ్డు రకం వడ్లను కొనుగోలు చేసే విషయంలో సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో మొన్నటి అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వరి రైతులకు రూ. 5 వందల బోనస్ ఇస్తామని ప్రకటించింది. అధికారం చేపట్టిన తర్వాత బోనస్ విషయంపై తర్జనభర్జనల అనంతరం ఇటీవల సన్న రకాలకు మాత్రమే బోనస్ ఇస్తామని వెల్లడించింది. అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నా, ఇప్పుడైతే సన్న రకాలకే బోనస్ ఇస్తామని ప్రకటించింది. ఎన్నో ఏళ్లుగా దొడ్డు రకాల సాగుకు అలవాటు పడిన రైతుల్లో ఏమేరకు మార్పు వస్తుందన్న దానిపై వేచిచూడాలి. అయితే సన్న రకాల్లో ఏ విత్తనం వేయాలన్నదానిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. చాలా రకాల విత్తనాలు మార్కెట్‌లో ఉన్నాయి. అయితే ఏ రకం విత్తనమైనా సాగు చేయొచ్చా లేదా అన్న దానిపై క్లారిటీ రావాల్సి ఉంది. రోహిణీ కార్తె త్వరలో ప్రవేశించనున్న నేపథ్యంలో ప్రభుత్వం సన్నరకాల సాగుకు సంబంధించి విధివిధానాలు ప్రకటిస్తే రైతులు అందుకు అనుగుణంగా తమ పంట పద్ధతులపై ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంది.

### ఆసక్తి చూపుతున్న రైతులు

సన్న రకం వరి సాగు చేయడానికి కొందరు రైతులు ఆసక్తి చూపుతున్నారు. కొంత దిగుబడి తక్కువ వచ్చినా, బోనస్‌తో సర్దుబాటవుతుందన్న ధోరణితో రైతులు సన్నాల సాగుకు మొగ్గు చూపుతున్నారు. గ్రామాల్లో రైతుల మధ్య చర్చ కూడా జరుగుతోంది. అయితే వ్యవసాయ శాఖ మాత్రం ఇప్పటికీ ఎలాంటి విధివిధానాలు రాలేదని, రాగానే చెబుతామంటున్నారని రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం సన్నాలకు సంబంధించి వివరాలు వెల్లడించడంతో పాటు అవసరమైన విత్తనాలు కూడా అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉంది. సన్నాల సాగుకు వ్యవసాయ శాఖ రైతులకు అవగాహన కల్పించి, భరోసా ఇవ్వాల్సిన అవసరం కూడా ఉంది.

## కామారెడ్డి వ్యవసాయ ఆధారిత జిల్లా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

- కలెక్టర్ జితేష్ వి పాటిల్

**కామారెడ్డి క్రైం:** కామారెడ్డి జిల్లా వ్యవసాయ ఆధారిత ప్రాంతమని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరు, ప్రజాభిప్రాయం, ప్రజాసమస్యలపై అధ్యయనం చేయడానికి జిల్లాకు వచ్చిన 27 మంది కేంద్ర సెక్రెటేరియట్ బృందంతో శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన పర్యటన ముగింపు సమావేశంలో మాట్లాడారు. మానవ వనరుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వివిధ మంత్రిత్వ శాఖలో పనిచేస్తున్న అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ల బృందం ఈ నెల 20 నుంచి 24 వరకు ఐదు రోజుల పాటు జిల్లాలోని పద్మాజివాడ, శివాయిపల్లి, నర్సన్నపల్లి, దోమకొండ, ఫరీద్ పేట గ్రామాల్లో అమలు జరుగుతున్న పలు కార్యక్రమాలను అధ్యయనం చేయడాన్ని కలెక్టర్ అభినందించారు. బృందం ఐదు రోజుల పాటు పాఠశాలలు, డిజిటల్ తరగతులు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామీణ ఉపాధి హామీ పనులు, స్వయం సహాయక బృందాల పనితీరు, ఆస్పత్రులు, విద్యుత్, డబుల్ బెడ్ రూం ఇళ్లు, రేషన్ కార్డులు, భూ సమస్యలు, అంతర్గత రహదారులు తదితర అంశాలపై క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్యక్రమాలను లోతుగా అధ్యయనం చేయడం ద్వారా ఎక్కడ లోటుపాట్లు ఉన్నాయో గుర్తించి పథకాలను మరింత పటిష్టంగా అమలు చేయడానికి వీలవుతుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో చందర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి

- మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఇందుప్రియ

**కామారెడ్డి టౌన్:** పట్టణంలోని ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వార్డుల్లో నీటి ఎద్దడి, సానిటేషన్ సమస్యలపై చర్చించారు. ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా చూడాలని కౌన్సిల్ సభ్యులు చైర్‌పర్సన్ దృష్టికి తీసుకొచ్చారు. అవసరమైతే నీటి ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని కోరారు. మున్సిపల్ బోర్లలో ఎప్పటికప్పుడు నీటి మోటారు పంపులకు మరమ్మతులు చేయించాలన్నారు. ఇంటింటా చెత్తసేకరణ సవ్యంగా జరగాలని కోరారు. సానిటేషన్ విభాగం వాహనాల్లో ఇంధనం పక్కదారి పట్టకుండా, ప్రజాధనం వృథా చేయవద్దని అధికారులకు ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, సానిటేషన్ విభాగాల అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన పాలిసెట్

- పరీక్షకు హాజరైన 2,134 మంది
- 167 మంది గైర్హాజరు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ పాటిల్

**కామారెడ్డి అర్బన్:** పాలిటెక్నికల్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పాలిసెట్-2024 ప్రవేశ పరీక్ష శుక్రవారం కామారెడ్డిలో ముగిసింది. కలెక్టర్ జితేష్ వి పాటిల్ పరీక్ష కేంద్రాలను సందర్శించి పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. జిల్లాకు సంబంధించి 2,301 మంది అభ్యర్థులకు కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, ఎస్ఆర్‌కే, సాందీపని డిగ్రీకళాశాల్లో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేయగా 2,134 మంది హాజరయ్యారు. వీరిలో బాలికలు 1,081 మంది, బాలురు 1,053 మంది హాజరుకాగా 167 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష కొనసాగిందని పాలిసెట్ జిల్లా సమన్వయకర్త విజయ్‌కుమార్, సహాయ సమన్వయకర్త శంకరయ్య తెలిపారు. పరీక్ష కేంద్రాలను సాంకేతిక విద్యా శాఖ పరిశీలకులు భరత్‌కుమార్, మెంటార్ హరికృష్ణ, ప్రత్యేక స్క్వాడ్ బృందం సభ్యుడు బలరాం, గోపాల్, ఆంజనేయులు తనిఖీ చేశారు.

## మిల్లర్లతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం



తలమడ్లలో రైతులతో మాట్లాడుతున్న అధికారులు

**రాజంపేట:** రైస్ మిల్లర్లతో మాట్లాడి ధాన్యం అన్‌లోడింగ్ సమస్యను పరిష్కరిస్తామని జిల్లా సివిల్ సప్లయ్స్ అధికారి మల్లికార్జున్ రాజంపేట మండలం తలమడ్ల రైతులకు హామీ ఇచ్చారు. శుక్రవారం ఆయన గ్రామానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. రైస్ మిల్లర్లు ధాన్యాన్ని అన్‌లోడ్ చేసుకోకపోవడంతో తలమడ్ల రైతుల రెండు రోజులుగా పాటు ఆందోళన నిర్వహించారు. విషయాన్ని ఫోన్‌లో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డికి వివరించారు. దీంతో ఆయన వెంటనే అధికారులతో మాట్లాడి సమస్యను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. సివిల్ సప్లయ్స్ అధికారులు గ్రామానికి చేరుకుని రైతులతో సమస్యపై చర్చించారు. రైస్ మిల్లర్లతో చర్చలు జరుపుతున్నామని వరి ధాన్యాన్ని గ్రేడ్-1, గ్రేడ్-2లుగా నిర్ధారించి ధాన్యం అన్‌లోడింగ్‌కు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్స్ డీటీ శ్రీనివాస్, సహకార సంఘం అధికారి భూమన్న, తహసీల్దార్ అనిల్ కుమార్, ఏడీఏ అపర్ణ, ఏఈవో సుప్రజ్యోతి, సొసైటీ చైర్మన్ సిద్ధరాములు పాల్గొన్నారు.

## అడ్డగోలుగా వెంచర్లు..!

- బాన్సువాడలో నిబంధనలకు విరుద్ధంగా వెలుస్తున్న వైనం
- కనీస సౌకర్యాలు కల్పించకుండా ప్లాట్లు చేస్తున్న రియల్టర్లు
- శిఖం, అసైన్డ్ భూములు కబ్జా చేసి 10శాతం స్థలాల కేటాయింపు



బాన్సువాడలో చెరువు శిఖంను కబ్జా చేసేందుకు వేసిన మట్టి

**బాన్సువాడ:** బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు అడ్డగోలుగా వెంచర్లు వేస్తున్నారు. డీటీసీపీ నిబంధనల ప్రకారం వెంచర్ నిర్మించి లేఅవుట్‌గా మార్చి విక్రయించాల్సి ఉండగా.. కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండానే వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారు. లేఅవుట్ చేయించకుండానే ప్లాట్లు చేసి అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు.

**కొన్నే డీటీసీపీ.. మిగిలినవన్నీ నాన్ లేఅవుటే..**

బాన్సువాడ పట్టణంలో పదుల సంఖ్యలో వెంచర్లు వెలిశాయి. అయితే వీటిలో కొన్నింటికే డీటీసీపీ అనుమతులు ఉన్నాయి. కాగా మిగతా వాటిని లేఅవుట్ చేయించకుండానే రియల్టర్లు అమ్ముకున్నారు. అంతేకాకుండా కనీస నిబంధనలు సైతం పాటించడం లేదు. రోడ్లను 40, 33 అడుగుల వెడల్పు వేయాల్సి ఉన్నా.. 30, 25 అడుగుల మేరకే వేస్తున్నారు. ఇక కమ్యూనిటీ అవసరాలకు విడిచిన స్థలాలను కూడా కనుమరుగు చేస్తున్నారు. ఇక ప్లాట్ల సైజులు కూడా పొడవు, వెడల్పులు తగ్గించి 200 చదరపు అడుగుల నుంచి 150 చదరపు గజాలకు చేరుకున్నాయి. ఆయా వెంచర్లలో రోడ్లు ఏర్పాటు చేయకపోవడంతో పాటు విద్యుత్, తాగునీరు, డ్రెయినేజీలు తదితర వసతులు కల్పించడంలేదు.

**చెరువుల శిఖం, అసైన్డ్ భూములకు ఎసరు..**

మున్సిపాలిటీ పరిధిలో వెలుస్తున్న వెంచర్లు ఎక్కువగా చెరువుల పక్కనే ఉంటున్నాయి. చెరువులకు సమీపంలో ఉన్న రైతుల భూములను కొనుగోలు చేసి వెంచర్లుగా మారుస్తున్నారు. డీటీసీపీకి అనుమతుల కోసం పంపిన ఫైల్‌లో నిబంధనల ప్రకారం ఇరిగేషన్, రెవెన్యూ నుంచి అనుమతులు తీసుకున్నట్లు చూపిస్తారు. కానీ వాస్తవానికి వెంచర్ల పక్కనే ఉండే శిఖం, అసైన్డ్ భూములను వెంచర్లలో కలుపుకొని ప్లాట్లు చేస్తున్నారు.

మున్సిపాలిటీకి ఇవ్వాల్సిన 10 శాతం స్థలాలు, రోడ్లు అన్ని శిఖం, అసైన్డ్ భూముల్లోనే చూపిస్తున్నారు. మిగతా పట్టా భూముల్లో ప్లాట్లు చేసి అమ్మి సొమ్ము చేసుకుంటారు. ఈ తతంగంపై మున్సిపల్ చైర్మన్ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమంగా వేసిన వెంచర్లపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

### అనుమతుల్లో అవకతవకలపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్ కార్యాలయ అధికారికి ఫిర్యాదు చేస్తున్న మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు

**బాన్సువాడ:** బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో వెంచర్లు, భవన నిర్మాణాల అనుమతుల అవకతవకలపై శుక్రవారం బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, కౌన్సిలర్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గంగాధర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న వెంచర్లు, భవన నిర్మాణాల అనుమతుల్లో అవకతవకలు జరుగుతున్నాయని, వెంచర్లలో చెరువుల శిఖం, అసైన్డ్ భూములను కబ్జా చేసుకుని శిఖం, అసైన్డ్ భూముల్లోనే 10 శాతం స్థలాలను మున్సిపాలిటీకి ఇస్తున్నారని, కొన్ని వెంచర్లలో 10 శాతం మున్సిపల్ స్థలం చూపించడం లేదని వివరించారు. గతంలో పనిచేసిన టౌన్ ప్లానింగ్ అధికారి సహకారంతో రియల్టర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. భవన నిర్మాణాలకు సెట్ బ్యాక్ వదలకుండా నిర్మాణాలు చేపడుతున్నారని వివరించారు. వెంచర్లలో మొక్కలు నాటడం లేదని, విద్యుత్ స్తంభాలు, రోడ్లు, పార్కు స్థలాలు, డ్రెయినేజీలు తదితర సౌకర్యాలు కల్పించకుండా ఇష్టానుసారంగా వెంచర్లు నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. 2020 నుంచి నేటి వరకు బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో వెలిసిన వెంచర్ల పూర్తి వివరాలు సేకరించి, సంబంధిత అధికారులు, వెంచర్ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని విన్నవించామన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్, కౌన్సిలర్లు బాడి శ్రీనివాస్, హకీం, కిరణ్, నందకిషోర్, పాశం రవీందర్‌రెడ్డి, నర్సగౌండ, మోతీలాల్, ఆమేర్, హైమద్, కనుకుట్ల రాజు తదితరులున్నారు.

### సుందరం.. తురాయి అందం..



జిల్లాలోని రహదారుల వెంట తురాయి పూలు కనువిందు చేస్తున్నాయి. గాంధారి – బాన్సువాడ రోడ్డుకు ఇరువైపులా సర్వాపూర్ శివారులో వరుసగా పెరిగిన చెట్లకు విరగబూసిన తురాయి పూలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. సుందరంగా కనిపిస్తున్న ఈ దృశ్యాలను చూసి వాహనదారులు సంబరపడుతున్నారు.

– సాక్షి, కామారెడ్డి

## హైవేపై లారీ దగ్ధం



**ఆర్మూర్ టౌన్:** ఎదురెదురుగా రెండు లారీలు ఢీకొనగా ఒక లారీ దగ్ధమైంది. ఈ ఘటన ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని జాతీయ రహదారి 63పై శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రానైట్ లోడ్‌తో గుజరాత్ నుంచి లారీ విశాఖపట్నం వెళ్తుంది. ఈ లారీ, కరీంనగర్ నుంచి నిజామాబాద్ వెళ్తున్న మరో లారీ హైవేపై తిరుమల గార్డెన్ వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గ్రానైట్ లోడ్‌తో వెళ్తున్న లారీ ముందు భాగం దగ్ధమైంది. ఈ లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్‌ను స్థానికులు బయటకు తీసుకొచ్చారు. వారు తీవ్రంగా గాయపడ్డారు. మరో లారీ క్లీనర్‌కు గాయాలు అయ్యాయి, డ్రైవర్ కిందకు దూకడంతో గాయాలు కాలేదు. స్థానికులు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు. గాయపడ్డ ముగ్గురిని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంతో భారీగా ట్రాఫిక్ జాం కాగా ఆర్మూర్ సీఐ రవికుమార్, ఎస్సై అశోక్ ఘటనా స్థలానికి చేరుకొని క్లియర్ చేశారు.

## క్లుప్తంగా

### వ్యవసాయ భూమే క్రీడా మైదానం



బాల్కొండ: గ్రామీణ స్థాయి నుంచే క్రీడాకారులను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పల్లె ప్రగతిలో భాగంగా ఏర్పాటు చేసిన 'క్రీడా ప్రాంగణాలు' నిర్వహణ లేక మూలనపడ్డాయి. దీంతో వ్యవసాయ భూముల్లో పిల్లలు ఆటలు ఆడుకుంటున్నారు. వేసవి సెలవులు కావడంతో మెండోరా మండలం వెల్కటూర్ తండాలో చిన్నారులు ఇలా క్రికెట్ ఆడుతూ కనిపించారు. పల్లెల్లో 'క్రీడా ప్రాంగణం' బోర్డులు పెట్టి చేతులు దులుపుకున్నారని పలువురు విమర్శిస్తున్నారు. పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకురావాలని క్రీడాకారులు కోరుతున్నారు.

### ప్రభుత్వం హామీలను నెరవేరుస్తుంది



భిక్కనూరు : రైతులకు ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి పంద్రాగస్టు లోగా రూ.2 లక్షల రుణమాఫీ పథకాన్ని అమలు చేస్తారని.. చేయకుంటే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు, రామేశ్వర్‌పల్లి ఎంపీటీసీ సభ్యుడు మద్ది చంద్రకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షపాత పార్టీ అని, ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తుందన్నారు. బీఆర్ఎస్ హయాంలో రైతులకు ఒరిగిందేమీ లేదన్నారు.

### వాహనాల వేలం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయం ఆవరణలో అధికారులు శుక్రవారం మూడు వాహనాలకు వేలం వేశారు. మొత్తం 10 మంది వేలం పాటలో పాల్గొనగా, రూ.88,900కు వాహనాలను దక్కించుకున్నట్లు ఎక్సైజ్ సీఐ స్టీవెన్‌సన్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి మల్లారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

### ముగిసిన కేంద్ర బృందం పర్యటన



కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మండలం నర్సన్నపల్లిలో ఐదు రోజులుగా పర్యటించిన కేంద్ర బృంద సభ్యులు శుక్రవారంతో తమ పర్యటన ముగించారు. దీంతో ఐదు రోజులపాటు గ్రామంలో మౌలిక వసతులపై అధ్యయనం చేసిన కేంద్ర బృందం సభ్యులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలు తీరు తదితర వాటిని అడిగి తెలుసుకున్నారు. గ్రామాభివృద్ధి కోసం రూ.5,100 విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగవర్ధన్, ఎంపీవో మల్హారి, గ్రామ కార్యదర్శి నవనీత, కేంద్ర బృందం సభ్యులు రాహుల్, పియూష్ గోయల్, ఉత్కర్ష్ వర్మ తదితరులున్నారు.

# 'లాభాల సాగు'కు ఉత్సాహం

**సీజన్‌కు నెల రోజుల ముందే పసుపు సాగు పనులు ప్రారంభం**

- పెరగనున్న సాగు విస్తీర్ణం
- ఈ ఏడాది రికార్డు ధర పలికిన పసుపు

పంటల్లో తల్లి పంటగా.. పచ్చ బంగారంగా పసుపు సాగుకు రైతులు ఉత్సాహం చూపుతున్నారు. ఈ ఏడాది మార్కెట్‌లో మంచి ధర పలకడంతో ఆనందంలో ఉన్న రైతులు ఈ సీజన్ ప్రారంభానికి సుమారు నెల ముందు నుంచే పంట సాగు పనులను ప్రారంభించారు. ఈ ఏడాది పంట సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది.



వెల్కటూర్‌లో పసుపు విత్తుతున్న రైతులు



వెల్కటూర్ తండాలో పసుపు విత్తనాన్ని వేరు చేస్తున్న మహిళలు

బాల్కొండ: పసుపు సాగు పనులను ప్రతి ఏడాది జూన్ మొదటి వారం నుంచి ప్రారంభిస్తారు. ఈ ఏడాది మార్కెట్‌లో పంటకు మంచి ధర లభించడం.. లాభాలు తెచ్చిపెట్టడంతో రైతులు ఉత్సాహంగా ఉన్నారు. పంట సాగు పనులను సుమారు నెల రోజుల ముందే ప్రారంభించారు. దశాబ్దకాలంగా పసుపు చేదు అనుభవాలను మిగిల్చినప్పటికీ రైతులు ఆశలు వదులుకోలేదు. పసుపును 'తల్లిపంట'గా నమ్మే రైతులు ఎలాంటి పరిస్థితులు ఎదురైనా పంటసాగును వదులకోలేదు. ఫలితంగా ఈ ఏడాది మంచి ధర లభించింది. క్వింటాల్‌కు రూ.20వేల వరకు ధర పలికింది. ఈ నేపథ్యంలో రైతులు ఉత్సాహంగా ఉన్నారు. సాధారణంగా జూన్ మధ్య మాసంలో పంట సాగు పనులను ప్రారంభిస్తారు. కానీ భూ గర్భ జలాలు సమృద్ధిగా ఉన్న రైతులు పంట సాగు పనులను కొద్దిరోజుల క్రితమే ప్రారంభించారు. ఎకరానికి సుమారు రూ.లక్ష నుంచి రూ.లక్షా యాభైవేల వరకు పెట్టుబడి పెట్టి ఆర్మూర్ డివిజన్‌లోని రైతులు పసుపును సాగు చేస్తుండగా, జిల్లాలో ఏటా సుమారు 33ఎకరాల విస్తీర్ణంలో పంట సాగవుతోంది. ఈ ఏడాది మంచి ధర పలికిన నేపథ్యంలో పసుపు సాగు విస్తీర్ణం భారీగా పెరిగే అవకాశం ఉంది. మరో 20శాతం సాగు విస్తీర్ణం పెరగొచ్చని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. పసుపు బోర్డు ఏర్పాటు ప్రకటనతో పసుపునకు మంచి ధర దక్కిందని మరికొందరు అంటుంటే.. సాగు విస్తీర్ణం తగ్గడం కారణంగానే పసుపు ధర పెరిగిందని మరికొందరు అంటున్నారు. ఏది ఏమైనా పసుపు రైతులకు మంచి రోజులు వచ్చాయనే చెప్పొచ్చు.

**జనవరి నుంచి తవ్వకాలు**

జనవరి మధ్య మాసం నుంచి పసుపు తవ్వకాలు ప్రారంభిస్తారు. తవ్విన పసుపు ఉడకించి ఆరబెట్టి, శుద్ధి చేసిన తర్వాత మార్కెట్‌కు తరలిస్తారు. ఏప్రిల్ చివరి వరకు తవ్వకాలు కొనసాగుతాయి. పంట దిగుబడిని అధికంగా నిజామాబాద్‌తోపాటు మహారాష్ట్రలోని సాంగ్లి మార్కెట్‌కు తరలిస్తారు.

### తల్లి పంటగా పసుపు

పసుపు పంట అనగానే రైతులు తమ పాలిట తల్లి పంటగా పేర్కొంటారు. తాము ఎన్ని పంటలు సాగు చేసినా అధిక లాభాలను తెచ్చి పెట్టేది పసుపు పంట అని రైతులు అంటున్నారు. అన్నీ కలిసి వస్తే ఎకరానికి 30 క్వింటాళ్ల నుంచి 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. క్వింటాల్‌కు రూ.10 వేలకు పైగా ధర పలికితే రైతులకు ఎంతోకొంత గిట్టుబాటు అవుతుంది. అయితే, వాతావరణంలో మార్పుల కారణంగా పంట దిగుబడి అంతగా రావడం లేదని రైతులు వాపోతున్నారు. ఎర్ర మట్టి నేలల్లో అధికంగా దిగుబడి వస్తుందని అంటున్నారు.

## ఎలుగుబంటి సంచారం

- నీటి కోసం పంట చేలలోకి..
- భయాందోళనలో మెంగారం, బోనాల్ గ్రామాల ప్రజలు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మెంగారం–బోనాల్ గ్రామాల మధ్య అటవీ ప్రాంతం నుంచి వచ్చి రోడ్డుపై ఎలుగుబంటి సంచరిస్తోందని వాహనదారులు తెలిపారు. బుధ, గురువారాల్లో సాయంత్రం సమయంలో అటవీ ప్రాంతం నుంచి ఎలుగుబంటి మెంగారం – గాంధారి రోడ్డుపైకి వచ్చి తిరిగినట్లు ప్రయాణికులు గమనించారు. ఎలుగుబంటి సంచరిస్తున్న దృశ్యాలను వాహనదారులు తమ సెల్‌ఫోన్లలో బంధించారు. దీంతో మెంగారం, బోనాల్ గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అటవీప్రాంతంలో నీరు దొరక్క ఎలుగుబంటి పంట పొలాల్లోకి వస్తోందని, అటవీ అధికారులు సాసర్‌పిట్‌లలో నీటిని నింపాలని కోరుతున్నారు. గత నెల రోజులుగా మూడు ఎలుగుబంట్లు అటవీప్రాంతానికి విడిచి పంటచేలల్లోకి వస్తున్నాయంటున్నారు.

## అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని ఫిర్యాదు

ఎల్లారెడ్డి : తన భర్తతోపాటు ఆయన కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని మండలంలోని అడవిలింగాల గ్రామానికి చెందిన బోరంచ లక్ష్మి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి..

లక్ష్మికి మహారాష్ట్రలోని నాందెడ్ పట్టణానికి చెందిన దండెపు వినోద్‌తో నాలుగు సంవత్సరాల క్రితం పెళ్లయ్యింది. గత కొద్ది రోజులుగా అత్త సరస్వతి, ఆడపడుచు జ్యోతితోపాటు ఆమె భర్త సంజీవ్ రూ.లక్షా 30 వేల అదనపు కట్నం తీసుకురావాలని లక్ష్మిని శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారని లక్ష్మి ఫిర్యాదులో పేర్కొంది. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## తండాకు విద్యుత్ షాక్

- ఒకరికి తీవ్ర గాయాలు
- పలుగుట్ట తండాలో నాలుగు రోజులుగా సమస్య
- సబ్‌స్టేషన్ ఎదుట తండావాసుల ధర్నా



తండాలోని విద్యుత్ ఫీడర్

రాజంపేట: మండలంలోని కొండాపూర్ పరిధిలో ఉన్న పలుగుట్ట తండాలో గత నాలుగు రోజులుగా విద్యుత్ సమస్య తలెత్తింది. తండాలోని ట్రాన్స్‌ఫార్మర్ ఫీడర్ వద్ద ఎర్తింగ్ తీగలు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా మారిందని తండావాసులు తెలిపారు. ఇళ్ల గోడలకు సైతం గురువారం విద్యుత్ సరఫరా కావడంతో తండావాసులు భయాందోళనకు గురయ్యారు. తండాకు చెందిన శ్రీనివాస్ ట్రాన్స్‌ఫార్మర్ ఫీడర్ వద్దకు వెళ్లి వైర్లను సరి చేస్తుండగా షాక్‌కు గురయ్యాడు. తీవ్రగాయాలపాలైన శ్రీనివాస్‌ను కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తండావాసులు వెంటనే కొండాపూర్ సబ్‌స్టేషన్‌కు సమాచారం అందించగా విద్యుత్ సరఫరా నిలిపివేశాడు. ఆగ్రహానికి గురైన తండావాసులు సబ్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో సంబంధిత అధికారులు తండాకు చేరుకొని సమస్యను పరిష్కరించారు.

## కంపోస్టు ఎరువు తయారు చేసుకోవాలి

ఎల్లారెడ్డి రూరల్ : రైతులు జీపీ ద్వారా సేకరించిన తడి చెత్తతో కంపోస్ట్ ఎరువులు సిద్ధం చేసుకోవాలని ఎల్లారెడ్డి ఎంపీవో ప్రకాష్ సూచించారు. శుక్రవారం మండలంలోని శివాపూర్ జీపీ పరిధిలో కంపోస్ట్ షెడ్లను పరిశీలించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి సేకరించిన తడి చెత్త ద్వారా ప్రతి 45 రోజులకు కంపోస్ట్ ఎరువు సిద్ధం చేసుకోవచ్చన్నారు. గ్రామంలోని నర్సరీ, క్రిమిటోరియమ్, పల్లె ప్రకతి వనాన్ని ఆయన పరిశీలించారు.

## క్రైం కార్నర్

# భార్యతో గొడవపడి ఆత్మహత్య



రాజేందర్(ఫైల్)

రామారెడ్డి: కుటుంబంలో గొడవ కారణంగా భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై విజయ్ కొండ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన గాదం రాజేందర్‌కు అతడి భార్య సుజాతకు మధ్య శుక్రవారం ఉదయం గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన రాజేందర్ ఇంట్లో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి బాలవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**అప్పుల బాధ తాళలేక..**

నస్రుల్లాబాద్(బాన్సువాడ): అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై లావణ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. బీర్కూర్ మండల తిమ్మాపూర్ గ్రామానికి చెందిన శంకర్(45) ఆర్మూర్ మండలం వేంపల్లిలో ట్రాక్టర్ నడుపుతూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో అప్పులు కావడంతో మనస్తాపానికి గురైన ఆయన.. గురువారం తిమ్మాపూర్‌కు వచ్చి నస్రుల్లాబాద్ మండలం కొచ్చెరి మైసమ్మ ఆలయ సమీపంలో పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నవీపేట: మండలంలోని సిరన్‌పల్లి శివారులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సిరన్‌పల్లికి చెందిన షేక్ హుస్సేన్(18) అనే యువకుడు మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. జన్నేపల్లి నుంచి సిరన్‌పల్లి వైపు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా హుస్సేన్‌ను వేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొనడంతో ప్రమాదం జరిగిందన్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## విద్యుత్ షాక్‌తో ఆవు..

రామారెడ్డి: సదాశివనగర్ మండలం అడ్లూరు ఎల్లారెడ్డి గ్రామంలో విద్యుత్ షాక్‌తో ఆవు మృతి చెందింది. వ్యవసాయ భూమిలో తెగి పడిన విద్యుత్ వైర్లను తాకి తన ఆవు మృతి చెందిందని పయ్యావుల శ్రీను అనే రైతు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశాడు. తనకు నష్టపరిహారం చెల్లించాలని కోరాడు.

## ట్రాక్టర్లు సీజ్



మద్నూర్ పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

మద్నూర్(జుక్కల్): మంజీరా వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ శుక్రవారం తెలిపారు. డోంగ్లి మండలం కుర్లా, సిర్‌పూర్ గ్రామాల సమీపంలోని వాగుల్లో నుంచి అక్రమంగా ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తుండగా మేనూర్ గ్రామ శివారులో ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు.అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మద్నూర్‌కు చెందిన ఇద్దరితోపాటు ఇలేగావ్‌కు చెందిన మరో ఇద్దరు మొత్తం నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని హస్గుల్ మంజీరా నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులు గురువారం రాత్రి పట్టుకున్నారు. పక్కా సమాచారం మేరకు పోలీసులు ట్రాక్టర్‌ను బిచ్కుంద శివారులో పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనుమతి లేకుండా ఇసుక, మొరం తరలిస్తే కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ సురేశ్ హెచ్చరించారు.

## ఒకరి అదృశ్యం

నందిపేట్ (ఆర్మూర్): మండలంలోని తల్వేదకు చెందిన ఎలాసరం సత్యనారాయణ (40) అనే వ్యక్తి అదృశ్యమయ్యాడు. గురువారం పని నిమిత్తం వెళ్తున్నానని చెప్పి బయటికి వెళ్లిన సత్యనారాయణ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. సత్యనారాయణ భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాహుల్ తెలిపారు .

## స్వగ్రామానికి చేరిన మృతదేహం

మాచారెడ్డి: బతుకుదెరువు కోసం దుబాయ్‌కి వెళ్లి అక్కడ జరిగిన ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని కాకులగుట్టకు చెందిన భూక్యా భాస్కర్(25) మృతదేహం శుక్రవారం గ్రామానికి చేరింది. ఈనెల 19వ తేదీన విధి నిర్వహణలో భాగంగా బస్సులో వెళ్తుండగా.. బస్సు లోయలో పడి భాస్కర్ మృతి చెందాడని తండావాసులు తెలిపారు. భాస్కర్ మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

## నలుగురి రిమాండ్

నిజామాబాద్ రూరల్: అల్ప్రాజోలం పట్టుబడిన కేసులో నలుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ట్రెయినీ ఐపీఎస్, రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో చైతన్యరెడ్డి శుక్రవారం తెలిపారు. మండలంలోని ఓ గ్రామంలో 200 గ్రాముల నిషేధిత అల్ప్రాజోలం పట్టుబడగా, విచారణ చేపట్టి హైదరాబాద్‌లో ఉన్న ఇద్దరితోపాటు స్థానికులైన ఇద్దరిపై కేసు నమోదు చేసి మూడు రోజుల క్రితం రిమాండ్‌కు తరలించామన్నారు. పట్టుబడిన నలుగురు వ్యక్తుల వద్ద నుంచి మొత్తం 3.6 కిలోల నిషేధిత అల్ప్రాజోలం స్వాధీనం చేసుకున్నట్లు ట్రెయినీ ఐపీఎస్ అధికారిణి తెలిపారు.



# రైతు ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకు

- మార్కెటింగ్‌శాఖ ఆర్‌జేడీ సయ్యద్ ఈఫ్తికర్ నజీబ్



కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న వ్యాపారులు

సుభాష్‌నగర్: రైతు ప్రయోజనాలే లక్ష్యంగా మార్కెటింగ్‌శాఖ ముందుకెళ్తోందని ఆ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ సయ్యద్ ఈఫ్తికర్ నజీబ్ అన్నారు. నగరంలోని నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో మర్చంట్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా కమల్ కిశోర్ ఇనానీ, ప్రధానకార్యదర్శిగా జే మల్లేశ్, కోశాధికారిగా రాజేందర్‌తోపాటు కార్యవర్గసభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన సయ్యద్ ఈఫ్తికర్ నజీబ్ మాట్లాడుతూ.. మార్కెటింగ్‌శాఖపై రైతుల్లో నేటికీ విశ్వాసం ఉందన్నారు. మంచి ధర రావడంతోనే రైతులు మార్కెట్‌యార్డులకు పంటదిగుబడులను తీసుకువస్తున్నారన్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను ఆర్‌జేడీతోపాటు సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ వెంకటేశం సన్మానించి అభినందించారు. కార్యవర్గసభ్యులను వ్యాపారులు, హమాలీలు, దడువాయిలు, సిబ్బంది తదితరులు సన్మానించారు. కార్యక్రమంలో వ్యాపారులు లాభిశెట్టి శ్రీనివాస్, మాస్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# జీవన్‌రెడ్డి మాల్ రీ ఓపెన్

- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల నేపథ్యంలో ఆర్టీసీ అధికారుల నిర్ణయం



ఆర్మూర్ పట్టణంలోని జీవన్ రెడ్డి మాల్‌ను రీ ఓపెన్ చేస్తున్న ఆర్టీసీ అధికారులు

ఆర్మూర్: పట్టణంలోని జీవన్‌రెడ్డి మాల్‌ను ఆర్టీసీ అధికారులు శుక్రవారం రీ ఓపెన్ చేశారు. మాల్ నిర్వాహకుల నుంచి పలువురు (కార్పొరేట్ సంస్థలు) వ్యాపారులు సబ్ లీజ్ తీసుకున్న నేపథ్యంలో.. వారి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల మేరకు ఆర్టీసీ అధికారులు మాల్‌ను తెరిచారు. సుమారు రూ.7 కోట్ల అద్దె బకాయిల ఉండగా, యాజమాన్యం విడతల వారీగా బకాయిలు చెల్లిస్తోంది. అయితే, రూ.2కోట్ల 51 లక్షల 85 వేలు టీఎస్ ఆర్టీసీకి చెల్లించని కారణంగా సంస్థ యాజమాన్యం ఈ నెల 16వ తేదీన మాల్‌ను సీజ్ చేసింది. హై కోర్టు ఉత్తర్వుల మేరకు ఆర్మూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఆంజనేయులు సీల్‌ను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బకాయిల చెల్లింపునకు హైకోర్టు వారం రోజుల గడువు ఇచ్చిందని, నిర్దేశిత కాలంలో నిర్వాహకులు బకాయిలు చెల్లించని పక్షంలో తిరిగి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## గంట వ్యవధిలో తండ్రీ, కూతురు మృతి

- వీరన్నగుట్టలో విషాద ఛాయలు



మృతురాలు జ్యోతి (ఫైల్)



లక్ష్మణ్‌నాయక్ (ఫైల్)

రెంజల్/నవీపేట(బోధన్): గంట వ్యవధిలో తండ్రీకూతురు మృతి చెందిన ఘటన నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం వీరన్నగుట్ట తండాలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. తండాకు చెందిన కేతావత్ లక్ష్మణ్ తన కూతురు జ్యోతిని నవీపేట్ మండలం అబ్బాపూర్(బి) తండాకు చెందిన ప్రకాశ్‌తో వివాహం జరిపించారు. వారికి ఇద్దరు సంతానం కలిగారు. అయితే కొన్నేళ్లుగా అదనపు కట్నం కోసం జ్యోతిని భర్త వేధించసాగాడు. నాలుగేళ్ల కిందట ప్రకాష్ రెండో పెళ్లి చేసుకున్న తర్వాత వేధింపులు మరింత ఎక్కువయ్యాయి. దీంతో జ్యోతి 15 రోజుల కిందట పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబీకులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతోంది. తండ్రి లక్ష్మణ్ (52) గురువారం కూతురు వద్దకు ఆస్పత్రికి వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో రెంజల్ మండలం కళ్యాపూర్ సమీపంలో ఎదు రుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. తీవ్ర గాయాలైన లక్ష్మణ్‌ను 108 అంబులెన్స్‌లో నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. తండ్రి పరిస్థితి తెలుసుకున్న జ్యోతి ఆస్పత్రిలోనే చికిత్స పొందుతూ మృతి చెందింది.

కూతురు మరణించిన గంట వ్యవధిలోనే తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్న లక్ష్మణ్ మృతి చెందాడు. మృతురాలు జ్యోతి భర్త, మామ, అత్త ఇతర కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు నవీపేట ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. లక్ష్మణ్ మృతికి కారణమైన ట్రాక్టర్‌ను గుర్తించిన తండావాసులు శుక్రవారం నిజామాబాద్‌కు తరలి వెళ్లారు. ఆందోళనకు సిద్ధమవగా కుల పెద్దలు జోక్యం చేసుకుని సర్దిచెప్పారు. ఒకే రోజు తండ్రీ, కూతురు మృతి చెందడంతో గ్రామంలో విషాదం చోటు చేసుకుంది.

## వెయ్యి కోళ్లు మృతి



మృత్యువాత పడిన కోళ్లు

నిజాంసాగర్(జుక్కల్): రెండ్రోజుల క్రితం గాలివాన బీభత్సానికి కరెంట్ సరఫరా లేక తాగునీరు అందక శుక్రవారం పౌల్ట్రీలో వెయ్యి కోళ్లు మృతి చెందాయి. వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా మహమ్మద్‌నగర్ మండలంలోని గాలీపూర్, ముగ్దుంపూర్ గ్రామాల్లో రెండ్రోజుల క్రితం గాలివానకు చెట్లు, కరెంట్ స్తంభాలు నేలకూలాయి. ఈ క్రమంలో గాలీపూర్ శివారులో ఉన్న తిక్కల వెంకటేశానికి చెందిన పౌల్ట్రీ ఫారానికి రెండు రోజులుగా కరెంట్ సరఫరా నిలిచిపోయింది. దీంతో పౌల్ట్రీ ఫారంలో ఉన్న కోళ్లకు తాగు నీరు అందకపోవడం, కరెంట్ లేక ఉక్కపోతకు గురైన వెయ్యి కోళ్లు మృత్యువాత పడ్డాయి. రూ. 3 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపారు. రెవెన్యూ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు.

## గోరింకకు నీటి కష్టాలు



భానుడి ప్రతాపానికి పక్షులు విలవిలలాడుతున్నాయి. దాహార్తి తీర్చుకునే అవకాశం లేక ఓ గోరింక శుక్రవారం మండల కేంద్రంలో ఇబ్బందులు పడింది. ఆ పక్షి కష్టాన్ని గమనించిన స్థానికుడు కుమ్మరి వేణు బాటిల్‌లో నీటిని తీసుకువచ్చి పట్టాడు. బాటిల్‌లో పట్టిన నీటిని తాగిన గోరింక దాహార్తిని తీర్చుకుంది.

– రామారెడ్డి

# టీటీడీసీలో అగ్ని ప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది



దగ్ధమైన రికార్డులు, ఫర్నిచర్

- విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఘటన
- రికార్డులు, ఫర్నిచర్ దగ్ధం
- రూ.5లక్షల ఆస్తి నష్టం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): మండల కేంద్రంలోని సాంకేతిక శిక్షణ అభివృద్ధి కేంద్రం (టీటీడీసీ)లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగింది. కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాల్‌తోపాటు పక్కనే మరో గదిలో మంటలు చెలరేగాయి. గురువారం రాత్రి అక్కడే నిద్రించిన నైట్ వాచ్‌మెన్ ఒడ్డెన్న శుక్రవారం ఉదయాన్నే లేచి చూడగా కాన్ఫరెన్స్ హాలులో నుంచి దట్టమైన పొగలు రావడాన్ని గమనించి వెంటనే డీఆర్డీవో అధికారులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని రెండు గంటల పాటు శ్రమించి మంటలను ఆర్పివేశారు. అప్పటికే ఏసీ కాన్ఫరెన్స్ హాలులో ఉన్న డీఆర్డీఏకు సంబంధించిన రికార్డులు, ఫర్నిచర్ మొత్తం దగ్ధమైంది. డీఆర్డీఏ కార్యాలయం నూతన కలెక్టరేట్‌లోకి మారిన తరువాత పాత కార్యాలయంలో ఉన్న (ఐకేపీ, ఈజీఎస్) రికార్డులు, ఫర్నిచర్‌ను టీటీడీసీలో భద్రపరిచారు. అగ్ని ప్రమాదంలో రికార్డులతోపాటు ఫర్నిచర్ దగ్ధం కావడంతో సుమారు రూ.5లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు సిబ్బంది తెలిపారు. టీటీడీసీని డీఆర్డీవో సాయాగౌడ్, డీపీఎం శ్రీనివాస్ సందర్శించి పరిశీలించారు.

టీటీడీసీకి మినీ కలెక్టరేట్‌గా గుర్తింపు ఉంది. గతంలో నిత్యం ఈ కేంద్రంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేవారు. కలెక్టర్ యోగితా రాణా బదిలీ అయిన తర్వాత టీటీడీసీ కేంద్రాన్ని జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకోవడం తగ్గించారు. ప్రస్తుతం నెలకోసారి జిల్లా సమాఖ్య సమావేశాలు మాత్రమే కొనసాగుతున్నాయి.